జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
సోమవారం 22 జూన్ 2026 పేజీలు : 14






2 లో..

**దూరం పెట్టిందని... దారుణంగా హతమార్చాడు...!**

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం

## - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, జూన్ 21,( ప్రజాజ్యోతి ):**

ప్రస్తుత కాలంలో ఒత్తిడితో కూడిన జీవన విధానంలో ప్రతి ఒక్కరూ యోగ తమ దినచర్యలో భాగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్ఆర్) అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ లో ఆరోగ్య భారతి మిర్యాలగూడ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ, అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నాడు ఎమ్మెల్యే బిఎల్ఆర్. ఈ సందర్భంగా యోగాసనాలు వేసి, యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం యోగా అని అన్నారు. యోగా కేవలం శరీర ఆరోగ్యానికే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత,ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని, యోగ ద్వారా ఆరోగ్యవంతమైన ...మిగతా 2లో




## వానల కోసం ప్రత్యేక పూజలు



**ఆలేరు జూన్ 21 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం దిలవార్పూర్ గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కృషి రైతులు గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ గ్రామ సర్పంచ్ గౌలను ఆంజనేయులు వానల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కప్ప కాముడు ఆడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక రుగ్మతలను అధిగమించవచ్చు.

**నాగారం జూన్ 21ప్రజా జ్యోతి.**

యోగా తో మానసిక రుగ్మతలను అధిగమించవచ్చు అని నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ను పురస్కరించుకొని యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలు నిర్వహించి యోగ ద్వారా మానసిక ప్రశాంతత కలుగు తుందని అన్నారు. అనారోగ్య సమస్యలు అధిగమించాలంటే యోగనే సరైన మార్గమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డీఎస్పీ శివరామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు


**రామన్నపేట, జూన్ 21 (ప్రజా జ్యోతి)**



నల్లగొండ డీఎస్పీ శివరామిరెడ్డి జన్మదినం సందర్భంగా రామన్నపేట మండలం భోగారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ గారిని శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీ శివరామిరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. డీఎస్పీ శివరామిరెడ్డి శాంతిభద్రతల పరిరక్షణలో చూపుతున్న చొరవ, ప్రజల పట్ల వారు వ్యవహరిస్తున్న తీరు అభినందనీయమని ఈ సందర్భంగా బద్దుల ఉమా రమేష్ యాదవ్ కొనియాడారు.

## ఘనంగా శ్రీకృష్ణ నగర్ వెంచర్ ప్రారంభోత్సవం..

**సొంత ఇంటి కలకు శ్రీకారం...శ్రీకృష్ణ నగర్ వెంచర్ డీటీసీపీ అనుమతులతో ప్లాట్లు, గృహ నిర్మాణం..**



2

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం

(మొదటి పేజీ తరువాయి)



సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. యువతతో పాటు అన్ని వయసుల వారు యోగాను అభ్యసించాలన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ యోగా వలన రక్త ప్రసరణ, ఊపిరితిత్తులు సవ్యంగా పనిచేస్తాయని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, క్రీడాకారులు, యోగసాధకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, గుడిపాటి నవీన్, ఆరోగ్య భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్సీ రంగాచార్యులు, శ్రీధర్ రావు, చెరుపల్లి కరుణాకర్, టి హనుమంత రెడ్డి, కోల సైదులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ నగర్ వెంచర్ ప్రారంభోత్సవం..

**సొంత ఇంటి కలకు శ్రీకారం...శ్రీకృష్ణ నగర్ వెంచర్**

**డీటీసీపీ అనుమతులతో ప్లాట్లు, గృహ నిర్మాణం..**

**నల్గొండ జూన్ 21,(ప్రజా జ్యోతి ):**

ఆధునిక సౌకర్యాలతో ఘనంగా ప్రారంభమైన శ్రీకృష్ణ నగర్ వెంచర్ నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం సమీపంలోని హైదరాబాద్ రోడ్డుపై నూతనంగా అభివృద్ధి చేసిన శ్రీకృష్ణ నగర్ వెంచర్ ఘనంగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్లారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ ఎల్లందుల లింగస్వామి హాజరై తమ చేతుల మీదుగా బ్రోచర్ లాంచింగ్ చేశారు. ఈ సందర్భంగా వెంచర్ డెవలపర్స్ మాట్లాడుతూ.. నల్లగొండ నగరానికి సమీపంలో ఉన్నటువంటి ఈ వెంచర్ ను డిటిసిపి అనుమతుల లేఔట్ తో సకల సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని హైవే రోడ్డుకు దగ్గర గా చెరువుగట్టు గ్రామ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి సమీపంలో ఉండి భవిష్యత్తులో ఫ్యూచర్ సిటీగా మారబోతుందని అన్నారు. ఈ సందర్భంగా వెంచర్ నిర్వాహకులు జెల్ల గణేష్, బాలాజీ నాయక్ మరియు కొంగరి బ్రదర్స్ మాట్లాడుతూ..ఈ లేఅవుట్‌లో ఆధునిక సౌకర్యాలతో పాటు నివాస అవసరాలకు అనుగుణంగా అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. వెంచర్‌లో విశాలమైన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, గ్రౌండ్ వాటర్ పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, సీసీటీవీ భద్రతా వ్యవస్థ, చిల్డ్రన్స్ పార్క్, పచ్చని ప్రకృతి వాతావరణం, ఆహ్లాదకరమైన పచ్చని ప్రాంతం వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 40 అడుగుల మెయిన్ రోడ్‌తో వెంచర్‌కు సులభ రవాణా సౌకర్యం కల్పించబడిందన్నారు. అలాగే ఈ వెంచర్‌లో నివాస ప్లాట్లతో పాటు ఇంటి నిర్మాణానికి అనువైన స్థలాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ పెట్టుబడితో సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. కేవలం రూ.36.50 లక్షల నుంచి ప్రారంభమయ్యే సౌకర్యవంతమైన చెల్లింపు విధానాలతో ప్లాట్లు మరియు గృహ నిర్మాణ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ రోడ్డు రామనగర్ కాలనీ సమీపంలో ఉన్న ఈ వెంచర్ ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబాలతో నివసించేందుకు అనుకూలంగా ఉండటంతో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నల్గొండ మరియు గ్రామీణ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగపరచుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ ఓనర్స్ జెల్లా గణేష్ కొంగరి సత్యనారాయణ సుదర్శన్ పాండరి శ్రీకృష్ణ నగర్ వెంచర్ మేనేజింగ్ డైరెక్టర్ బాలాజీ నాయక్ మేనేజింగ్ డెవలపర్స్ అనంతరెడ్డి మందడి వెంకట్ రెడ్డి సాగర్ల సైదులు జనార్దన్ రెడ్డి గద్దర్ నరసన్న తిమ్మారెడ్డి కొండూరు శంకర్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# దూరం పెట్టిందని... దారుణంగా హతమార్చాడు...!

## మిర్యాలగూడ త్రిపుల్ మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు

## సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్

## వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ, జూన్ 21,( ప్రజాజ్యోతి ప్రతినిధి ):**

మిర్యాలగూడ పట్టణం లోని కలాల్‌వాడలో ఈ నెల 4న, జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ముగ్గురు సజీవదహనమై మృతి చెందిన కేసును నల్గొండ జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. తొలుత ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంగా భావించిన ఈ ఘటన వెనుక పథకం ప్రకారం జరిగిన హత్య ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.

జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలుగా ఏర్పడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.

కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, ఊళ్ళపాలెం గ్రామానికి చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. నిందితుడు గతంలోనే వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు, మోసాలకు పాల్పడిన చరిత్ర కలిగి ఉన్నట్లు విచారణలో తేలింది.

తెలుగు మ్యాట్రిమోనీ వంటి వివాహ వెబ్‌సైట్ల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారి నమ్మకాన్ని సంపాదించి వివాహం చేసుకోవడం లేదా వివాహం చేసుకుంటానని నమ్మించి ఆర్థిక ప్రయోజనాలు పొందడం నిందితుడి అలవాటుగా మారినట్లు పోలీసులు గుర్తించారు. ఇదే విధంగా మిర్యాలగూడ పట్టణంలోని కలాల వాడికి చెందిన ధనలక్ష్మి భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో తల్లి చంద్రకళ దగ్గర ఉంటుంది. ఆమె తో పరిచయంఏర్పరుచుకుని వివాహం చేసుకున్నాడు.

కాలక్రమేణా ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ధనలక్ష్మి అతడిని దూరం పెట్టింది. హాజీపూర్‌లో ఒక మహిళను మోసం చేశాడు. ఈ కేసులో జైలులో ఉన్న సమయంలో తనకు ఎలాంటి సహాయం చేయకపోవడం, బెయిల్ కోసంప్రయత్నించకపోవడం పట్ల నిందితుడు ధనలక్ష్మి పై తీవ్ర ఆగ్రహం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ధనలక్ష్మి మరియు ఆమె పిల్లలను హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాడు.

తన ప్రణాళికలో భాగంగా నేరానికి కొన్ని రోజుల ముందే రెక్కీ వేశాడు . సంఘటన జరిగిన రోజు ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న యాక్టివా స్కూటీని దొంగిలించి మిర్యాలగూడ వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో ఒక ప్లాస్టిక్ క్యాన్ కొనుగోలు చేసి పెట్రోల్ బంకులో పెట్రోల్ నింపించుకున్నాడు. అనంతరం పలు ప్రాంతాల్లో తిరుగుతూ రాత్రి వరకు సమయం గడిపి అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు. రాత్రి సమయం లో బాధితుల ఇంటి పరిసరాలను గమనించి అందరూ నిద్రలో ఉన్నారనినిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోకి ప్రవేశించాడు. అక్కడ ఉన్న ప్లాస్టిక్ బకెట్‌లో పెట్రోల్ పోసి నిద్రిస్తున్న వారిపై చల్లాడు. అనంతరం అగ్గిపుల్ల గీసి మంటలు అంటించి సంఘటనను ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలా కనిపించేలా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మంటలు నిందితుడికి కూడా అంటుకున్నప్పటికీ అక్కడి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. బాధితురాలు ధనలక్ష్మి సంఘటన జరిగిన రోజు




ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. అయితే ఇంట్లో నిద్రిస్తున్న ఆమె తల్లి వనం చంద్రమ్మ (48), కుమారుడు నక్క లక్ష్మణ్ (17), కుమార్తె నక్క ప్రణతి (15) మంటల్లో చిక్కుకుని సజీవదహనమై మృతి చెందారు. సంఘటన స్థలంలో లభించిన సూక్ష్మ ఆధారాలు, కాలిపోయిన ఇంటి వెనుక భాగంలో లభించిన పెట్రోల్ వాసన ఉన్న బకెట్, వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలు, ప్రయాణ మార్గానికి సంబంధించిన సమాచారం,సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి అరెస్టు చేశారు.

నిందితుడి వద్ద నుంచి స్కూటీ, పెట్రోల్ క్యాన్, బకెట్, పాక్షికంగా కాలిపోయిన షర్ట్, హెల్మెట్, సెల్‌ఫోన్, ఘటనాస్థలంలో వదిలివెళ్లిన చెప్పులను స్వాధీనం చేసుకున్నారు.

**ఆన్లైన్ వేదికల పట్ల అప్రమత్తంగా ఉండాలి:-** ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, వివాహ సంబంధాల కోసం ఉపయోగించే ఆన్‌లైన్ వేదికల ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూర్తిస్థాయి వివరాలు, నేపథ్యాన్నినిర్ధారించుకున్న తర్వాతే సంబంధాలు ఏర్పరచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ క్లిష్టమైన కేసును అత్యంత వేగంగా ఛేదించిన డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి, మిర్యాలగూడ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్‌లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్. వెంకటేశ్వర్లు, హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసాపత్రాలు మరియు నగదు రివార్డులను ప్రకటించారు.



# డా. పాండాల మహేశ్వర్‌కు 'కవి భూషణ' బిరుదు



**భూదాన్ పోచంపల్లి, జూన్ 21 (ప్రజాజ్యోతి)**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో శ్రీ మహతీ సాహితీ కవిసంగమం, కరీంనగర్ సంస్థ నిర్వహించిన ఆరవ వార్షికోత్సవ వేడుకల్లో భూదాన్ పోచంపల్లి మండలం గోసుకొండ గ్రామానికి చెందిన డా. పాండాల మహేశ్వర్కు "కవి భూషణ" బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. సోషల్ మీడియాలో 60 రోజుల పాటు నిర్వహించిన కవితా యజ్ఞంలో పాల్గొన్న కవుల సృజనాత్మకతను పరిశీలించి ఈ బిరుదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముక్కా సత్యనారాయణ, డి.ఎస్.వి. మహాలక్ష్మి, న్యాయకంటి నరసింహాశర్మ తదితర ప్రముఖులు పాల్గొని అవార్డు గ్రహీతలను సన్మానించారు.

# వైభవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ప్రథమ పుష్కర వేడుకలు

**మర్రిగూడ, జూన్ 21(ప్రజా జ్యోతి ):**



మర్రిగూడ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 12వ ప్రథమ పుష్కర వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రతిష్ఠాపన జరిగి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుష్కర వేడుకల సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఎనిమిది మంది వేద పండితుల ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, గణపతి పూజ, కలశ స్థాపనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సన్నాయి వాయిద్యాల మోతల నడుమ కలశాల ఊరేగింపు వైభవంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌కు, రాజగోపురాలకు కలశ జలాభిషేకం చేశారు. అనంతరం మూలవిరాట్‌తో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పూజలు, కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. నవగ్రహ సహిత మూలవిరాట్‌ల మంత్రసహిత హోమ పూర్ణశాంతి పూజలు జరిపారు. అలాగే, ఆలయంలోని శ్రీ నగరేశ్వర స్వామికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపును కనులపండువగా చేపట్టారు.

ఆలయ కమిటీ చైర్మన్ అర్థం దామోదర్ గుప్త మాట్లాడుతూ ఆలయ నిర్మాణం జరిగి 12 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ ప్రథమ పుష్కర వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకలకు వివిధ గ్రామాల నుంచి ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించి, అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరి సహకారంతో ఈ ప్రథమ పుష్కర వార్షికోత్సవ వేడుకలు దిగ్విజయంగా పూర్తయ్యాయని కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# గుండ్ల గూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మురళీధర్



**ఆలేరు జూన్ 21 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్ల గూడం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా దూసరి మురళీధర్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గంధ మల్ల అశోక్ వారికి నియమక పత్రం అందజేశారు. అనంతరం మురళీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, అంజయ్య, వెంకటేష్, ప్రశాంతు, లింగం, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతం

**ఆలేరు జూన్ 21 ప్రజా జ్యోతి**



కాంగ్రెస్ పార్టీకి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ బలోపితం అవుతుందని మండల పార్టీ అధ్యక్షుడు అశోక్ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని తూర్పు గూడెం గ్రామ శాఖ అధ్యక్షులుగా బుచ్చి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి నియమక పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపితం చేయాలని పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ రెడ్డి, సురేష్, నాగరాజు, శ్రీశైలం, మురళి, నర్సింలు ,ఉపేందర్, నర్సింలు, శేఖర్, సత్యనారాయణ నరేష్, నర్సింగరావు , అఖిల్ ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన ఉపేందర్ రెడ్డి

**ఆలేరు జూన్ 21 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి శనివారం మంత్రి సీతక్క మహిళ శిశు సంక్షేమ బిల్లింగ్ ప్రారంభోత్సవానికి హాజరైన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలు తో ఘనంగా సన్మానించారు. వారి వెంబడి ప్రభుత్వ విప్ ఐలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ఆలేరు జూన్ 21 ప్రజా జ్యోతి**




యోగా అనేది ఒక వ్యాయామం కాదు,అది తనువును, మనస్సును, ఆత్మను ఏకం చేసే గొప్ప సాధనం అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఎన్ సి సి అధికారి దూడల వెంకటేశ్ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక ఆలేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ సి సి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం లో వారు మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృఢంగా మార్చే యోగ ప్రతి ఒక్కరి జీవితానికి ఎంతో అవసరమని,మనిషి శరీరం చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగా ప్రథమ స్థానాన్ని సంపాదించుకోవడమే కాకుండా, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణకు నోచుకుంటుందని అన్నారు. ఏ వ్యాయామంతో కూడా పోల్చి చూసినప్పటికీ కూడా యోగాలో ఉన్న చాలా విశిష్టతలు యోగాని చాలా ప్రత్యేకంగా నిలబెడతాయని చెప్పారు. యోగా మన సంస్కృతి అని, మన సంపద అని శారీరక మానసిక ఒత్తిడిని తగ్గించే యోగా ని నిత్యం ఆచరించాలన్నారు. భారతదేశ ప్రజలకు వారసత్వ సంపదగా లభించిన గొప్ప మార్గం యోగ అని, ఇది ఎంతో ప్రాచీన కాలపు పద్దతి అయినప్పటికీ గత రెండు మూడు దశాబ్దాల కాలం నుండి ఆరోగ్య స్పృహ పరంగా ప్రతి ఒక ఆరోగ్య నిపుణుడు యోగ ను రిఫర్ చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ సి సి కాడెట్లతో యోగాసనాలు, ప్రాణాయామం ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు మేఘ రాజు, ఎన్సీసి కాడెట్లు వరుణ్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న 108 ఈఎంటి తొంట భాస్కర్ !

**మోత్కూరు, జూన్ 21 (ప్రజా జ్యోతి):**

మాతృ దేవోభవ- పితృ దేవోభవ స్వచ్ఛ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో కురుమేటి నరసమ్మ 17వ వర్ధంతి సందర్భంగా వలిగొండ మండలం ఎం తుర్కాపురం గ్రామంలో బెస్ట్ సేవా పురస్కారాలను ఆ సంస్థ వ్యవస్థాపకులు కురుమేటి నవీన్ ఆదివారం అందజేశారు. ఇందులో భాగంగా 108 అంబులెన్స్ సర్వీస్ లో ఈఎంటిగా పనిచేస్తూ అవసరమైనప్పుడు రక్తదానం చేస్తుండడంతో ఆయన సేవలను గుర్తించి బెస్ట్ సేవా పురస్కార అవార్డును తొంట భాస్కర్ కు అందజేశారు. శాలువా తో సన్మానించి సర్టిఫికెట్, మెమెంటో జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేసినందుకు మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య



అతిథిగా కాశీరాం బానోత్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వాణ్ణి బయటకు వదిలితే నన్నూ చంపేస్తాడు....!

## వంటిపై పెట్రోల్ పోసుకొని బాధితురాలి హంగామా



**మిర్యాలగూడ, జూన్ 21,( ప్రజాజ్యోతి ):**

తన తల్లిని, ఇద్దరు పిల్లల్ని సజీవంగా దహనం చేసిన తన రెండో భర్తను కఠినంగా శిక్షించాలని ఆదివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో బాధితురాలు ధనలక్ష్మి ఆందోళన చేపట్టింది. మొదటి భర్త చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి చంద్రకళ ఇంటి వద్ద ఉంటున్న తనకు ఆన్లైన్లో పరిచయమైన శ్రీకాళహస్తి శిరీష్ కుమార్ ను కుటుంబానికి అండగా ఉంటాడని వివాహం చేసుకున్నానని, కానీ అతని వ్యవహార శైలి నచ్చక దూరం పెట్టానని, తనపై కక్ష పెంచుకున్న అతను పెట్రోల్ పోసి తన తల్లిని,పిల్లలను సజీవంగా దహనం చేశాడని, తాను స్థానికంగా లేకపోవడంతో ప్రాణాలతో ఉన్నానని కన్నీటి పర్యంతమైంది. శిరీష్ బయటికి వస్తే తనను చంపేస్తాడని, అతడిని బయటికి రాకుండా పోలీసులు కఠినంగా శిక్షించాలని భయ భ్రాంతులకు గురవుతూ చెప్పింది. ఒక దశలో అతని ఎలాగూ చంపేస్తాడని ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసింది. గమనించిన బంధువులు పోలీసులు ఆమెను రక్షించి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అతనిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఆమెను సముదాయించి కౌన్సిలింగ్ చేసి ఇంటికి పంపారు.

# విరిగిన ఎముకకు కొత్త జీవం

## -యశోద ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు

## ఎముకల రీప్లేస్మెంట్లో సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణ్యం బృందం నూతన ఒరవడి

**హుజూర్ నగర్ జూన్ 21 (ప్రజా జ్యోతి)**

అత్యాధునిక శస్త్ర చికిత్సలతో మలక్ పేట్ యశోద హాస్పిటల్ విరిగిన ఎముకలకు కొత్త జీవం పోస్తుందనీ సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ కృష్ణ సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా కళ్యాణమండపం లో మలక్ పేట్ యశోద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సకు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ కృష్ణ సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో ఎముకలకు సంబంధించి శస్త్ర చికిత్సలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇటీవల పట్టణానికి చెందిన 54 సంవత్సరాల పసుపులేటి రవి తొంటి ఎముక విరగడంతో రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాడ్యులర్ బైపోలార్ హేమియార్థ్రోప్లాస్టీ




ద్వారా రోగికి మళ్లీ నడిచే సామర్థ్యాన్ని కల్పించామని తెలిపారు.గతంలో ఎముకలకు ఎలాంటి గాయాలు జరిగిన సిమెంట్ కట్లు నిర్వహించేవారు. నేడు అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి మలక్ పేట్ యశోద హాస్పిటల్ లో దేశం గర్వించదగ్గ స్థాయిలో ఆర్థోపెటిక్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శరీరంలో ఎక్కడ ఎముకలు విరిగిన ప్రపంచంలోనే వివిధ దేశాల వైద్య పరికరాల సహాయంతో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్థోపెటిక్ చికిత్స అనంతరం రోజుల వ్యవధిలోనే వారి పనులు వారు చేసుకున్న విధంగా చికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ ఎలేశ్వరం నరేష్, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ రంగా సంతోష్ కుమార్,ఏ.వాసు కిరణ్ రెడ్డి,తండు హరికృష్ణ, వెంకటేశ్వర్లు
పసుపులేటి రవి,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయ సాధన బీఆర్ఎస్ లక్ష్యం

**హాలియా,జూన్21(ప్రజా జ్యోతి)**

ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఘన నివాళి అర్పించారు.ఆదివారం హాలియా పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని ధారపోశారని ఈ సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుందామని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం కోసం సామాజిక రాజకీయ చైతన్యంతో ఆలోచన చేస్తూ అందుకు తగ్గ భావజాల వ్యాప్తిని కొనసాగించిన నిస్వార్ధ మేధావి తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ జయ శంకర్ అని కొనియాడారు.జయశంకర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు యడవల్లి మహేందర్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్,పట్టణ పార్టీ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ వర్ర వెంకటరెడ్డి,పిడిగం నాగయ్య,



సురభి రాంబాబు,చిట్టిప్రోలు శ్రీనివాస్,చేగొండి కృష్ణ,దోరేపల్లి వెంకటేశ్వర్లు,రావులపాటి ఎల్లయ్య,షేక్ షేక్ హుస్సేన్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజం కోసం యోగా..

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

తుంగతుర్తి, జూన్ 21,(ప్రజా జ్యోతి):

యోగాతో మానసిక ప్రశాంతత తో పాటు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన సమాజం కోసం యోగ చేయాలని సీఐ ఉపేందర్ రావు, ఎస్ఐ క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం తుంగతుర్తి లోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందితో యోగా అభ్యాసకుడు గోపాల్ రావు ఆసనాలు చేయించారు. మన శరీరం మనసును ఆధీనంలో ఉంచుకునేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.మనిషి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగా సాధనతో అనేక శారీరక రుగ్మతలు దూరం అవుతాయని, యోగా వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**నాంపల్లి, జూన్ ,21(ప్రజా జ్యోతి)**

:మండలంలోని తుంగపాడు గ్రామానికి చెందిన నేతల నరేష్ ఇటీవల మరణించడం జరిగింది. ఆదివారం ఇట్టి విషయం తెలుసుకున్న స్థానిక ట్రాక్టర్ ఓనర్లు అందరూ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ఎల్లవేళల అండగా నిలుస్తామని అన్నారు. అనంతరం వారికి 15 వేల 500 రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు 650 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

**తుంగతుర్తి, జూన్ 21,(ప్రజా జ్యోతి):**



తుంగతుర్తి అర్వపల్లి మండలాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పది లీటర్ల సారాయి స్వాధీనంతో పాటు 650 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ శ్రీ హరికిరణ్ ఆదేశాలానుసారం ఎస్ టి ఎఫ్ టీమ్, సూర్యాపేట టీమ్ మరియు తుంగతుర్తి టీమ్‌లు సంయుక్తంగా జజిరెడ్డిగూడెం మరియు తుంగతుర్తి మండలాలలోని రాజన్న తాండా, అన్నారం, మేడిబాయి తాండా, మర్రిబాయి తాండా మరియు కొమ్మాల గ్రామాలలో విస్తృతంగ దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దాడులలో 10 లీటర్ల ఐ.డి. (సారా) ను స్వాధీనం చేసుకోవడం జరిగినది మరియు 650 లీటర్ల బెల్లం పానకం అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మొత్తం 4 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.ఈ దాడులలో మూర్తి గా× (తుంగతుర్తి), స్వర్ణలత గా× (సూర్యాపేట), శోభారాణి గా× (గాఖీ) మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు భరోసా ఇవ్వలేని ప్రభుత్వం గద్దె దిగాలి:మట్టిపల్లి వెంకట్ యాదవ్

**తుంగతుర్తి, జూన్ 21,(ప్రజా జ్యోతి):**



రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతాంగం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతుందని బీఆర్ఎస్ నాయకుడు మట్టిపల్లి వెంకట్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతు భరోసా పేరుతో రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. వానాకాలం సాగు పనులు ప్రారంభమైనప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. గతంలో రెండు నెలల్లో రైతు భరోసా మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే రాబోయే రోజుల్లో రైతాంగం ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుందని ఆయన పేర్కొన్నారు.

# మంత్రి జూపల్లి, డిప్యూటీ సీఎం భట్టి పర్యటనలపై కాంగ్రెస్ నేతల సమీక్ష

**తుంగతుర్తి, జూన్ 21,(ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ల పర్యటనలను విజయవంతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలతో ఎమ్మెల్యే మందుల సామెల్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే





మాట్లాడుతూ.... జూన్ 22న నాగారం మండలం పణిగిరి గ్రామంలోని బౌద్ధ క్షేత్రంలో రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారని తెలిపారు. అలాగే జూన్ 24న నూతనకల్, మద్దిరాల మండలాల్లో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు.

ఈ పర్యటనలకు సంబంధించిన ఏర్పాట్లు, జన సమీకరణ, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై నాయకులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను చారిత్రాత్మక విజయం గా నిలపాలని, అందుకోసం ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో ప్రజలను తరలించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సభకు కనీసం ఐదు వేల మందికి తగ్గకుండా ప్రజలను సమీకరించడానికి కార్యచరణ రూపొందించాలని నాయకులకు సూచించారు. ఈ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలియజేస్తూ, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లేలా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. నేటితరం ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దారూరి యోగానంద చార్యులు, సామ అభిషేక్ రెడ్డి, అని రెడ్డి రాజేందర్ రెడ్డి, రేగటి రవి, ఇందుర్తి వెంకటరెడ్డి,దాయం ఝాన్సీ రాజిరెడ్డి, తుంగతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మోరపాక సత్యం, తోడుసు లింగయ్య, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బికోజి, గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భార్య కోసం టవర్ ఎక్కిన భర్త.. పోచంపల్లిలో కలకలం

**భూదాన్ పోచంపల్లి, జూన్ 21 (ప్రజాజ్యోతి):**

పట్టణ కేంద్రంలో ఆదివారం ఓ వ్యక్తి మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేయడంతో స్థానికంగా కలకలం రేగింది.
పట్టణానికి చెందిన కరగల్ల బాలస్వామి తన భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో స్థానిక ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలోని సెల్ టవర్ ఎక్కి కూర్చున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని అతడిని కిందకు దిగాలని పలుమార్లు కోరారు. ఈ క్రమంలో అతని భార్యను కూడా అక్కడికి పిలిపించి సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ బాలస్వామి టవర్ దిగేందుకు నిరాకరించడంతో పోలీసులు స్వయంగా టవర్ ఎక్కి అతడిని సురక్షితంగా కిందకు దించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పెద్ద సంఖ్యలో స్థానికులు అక్కడికి చేరుకుని వీక్షించారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.



# యోగతో ఆరోగ్యం.. ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు

భూదాన్ పోచంపల్లి, జూన్ 21 (ప్రజాజ్యోతి):

అంతర్జాతీయ 12వ యోగ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని పద్మశాలి సభ వేదిక గ్రౌండ్‌లో యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాభ్యాసం నిర్వహించడంతో పాటు, యోగ చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, యోగ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.
పట్టణ అధ్యక్షులు డబ్బికర్ సాహెష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షులు మేకల రవీందర్ రెడ్డి, భువనగిరి అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు చుక్క రెడ్డి, గంజి బస్వాలింగం, చేరకు వెంకటేష్‌తో పాటు ఏలే శ్రీనివాస్, రామిడి యాదిరెడ్డి, మణికంఠ, సత్యనారాయణ, వెంకటేష్, అంబదాస్, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, శ్రవణ్, బిక్షపతి, బాల మల్లేష్, శివ, భాస్కర్, మండల, జిల్లా నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# విద్యా సేవలో... ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్

## సంస్థాన్ నారాయణపురం మోడల్ స్కూల్ కు గట్టుప్పల్ జెడ్పి ఉన్నత పాఠశాలకు రెండు నూతన బస్సులు అందిస్తున్న ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్

**సంస్థాన్ నారాయణపురం,**

జూన్ 21, (ప్రజాజ్యోతి) : మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ విద్యా సేవలో మరో ముందడుగు వేస్తున్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ కు, గట్టుప్పల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఒక్కొక్క బస్సును సోమవారం అందజేస్తున్నారు. ఒక్కో బస్సును 30 లక్షల రూపాయలతో కొనుగోలు చేసి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పాఠశాలలకు ఉచితంగా అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తన వంతు కృషి ప్రారంభించారు. పాఠశాలలకు వివిధ గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థుల కోసం ఈ బస్సులను అందజేస్తున్నారు. పాఠశాలలకు బస్సులు లేక పేద విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న వి ఎల్ వి భాస్కర్ సమస్యను పరిష్కరించడం కోసం రెండు నూతన బస్సులను కొనుగోలు చేసి పాఠశాలలకు అందిస్తున్నారు. మండలంలోని అల్లందేవి చెరువు గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే వేసవి సెలవుల్లో చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎంసెట్, జేఈఈ ,నీట్, వంటి ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ సెంటర్ల ఏర్పాటు చేసి వందలాది మంది విద్యార్థులకు ఉచిత భోజనంతోపాటు కోచింగ్ ఇప్పించారు. అలాగే సమాజంలో ఆర్థికంగా ఇబ్బందులు పడు తున్న వారికి ఉచితంగా ఆర్థిక సహాయం, పేద రోగులకు ఉచితంగా మందులను అందిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధిని అందించే విధంగా ఆర్థిక సహాయం చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. అలాగే మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలలోని ప్రజలకు సాగు తాగునీటిని అందించే దిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు నేటి సరఫరాలో జరగబోతున్న




వివక్షతను కరపత్రాల రూపంలో ప్రజలందరికీ వివరించారు. ఇటు విద్య, అటు సాగునీటి వసతి కోసం, వెనుకబడిన ప్రజల కోసం ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ వాళ్లు రకాలుగా సేవలను అందిస్తున్నారు. మునుగోడు నియోజకవర్గ ప్రజలకు పలు రకాలుగా సేవలు చేస్తూ ప్రజలలో ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ప్రత్యేక గుర్తింపును పొందుతూ అభిమానాన్ని సాధిస్తున్నారు.

# పిడుగు.. పసిగట్టు

**-పిడుగుపాటును గుర్తించే 'దామిని'**

**-అకాల వర్షాలు, పిడుగులతో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు**

**-జాగ్రత్తలు పాటిస్తే బయటపడే అవకాశం**

నిడమనూరు,జూన్ 21(ప్రజాజ్యోతి): ఈదురు గాలులు, ఉరుములు,మెరుపులతో కూడిన ఆకాల వర్షాలు ప్రజా జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి వైఫరీ త్యాలైన ఉరుములతో కూడిన వర్షాలతోపాటు పిడు గుపాటుతో ప్రాణ, ఆస్తినష్టం జరుగుతూనే ఉంది. ఏటా పిడుగుపాటుకు గురై అధిక సంఖ్యలో మూగజీవాలు, చాలామంది ప్రజలు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అయితే పిడుగు పాటుపై పరిశోధనలు చేసిన భారత వాతా వరణ శాఖ ముందే పసిగట్టేందుకు ఓ యాప్ ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటరాలజీ (ఐఐటీఎం) 'దామిని' యాప్ ను రూపొందించింది.

-యాప్ డౌన్లోడ్ ఇలా..

ప్రతి పౌరుడు తన స్మార్ట్ ఫోన్లోని ప్లేస్టోర్ నుంచి దామిని యాప్ ను డౌన్లోడ్ చేసుకో వచ్చు. యాప్ ను తెరిచి పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్ కోడ్ నమోదు చేయాలి. అనం తరం జీపీఎస్ లొకేషన్ కోసం యాప్ అడిగే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. యాప్ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉందో లేదో మూడు రంగుల్లో చూపిస్తుంది.

-ఎరుపు రంగు : మీరు ఉన్న ప్రాంతంలో మరో 7 నిమిషాల వ్యవధిలో పిడుగుపడే అవకాశం ఉం టే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

-పసుపు రంగు : మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడేలా ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

-నీలం రంగు : 18 నుంచి 25 నిమిషాలలోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

-జాగ్రత్తలు పాటించాలి..

నల్లటి మబ్బులు ఆకాశం అంతటా విస్తరించి భారీ వర్షం కురుస్తున్నప్పుడు రైతులు పొలాల్లో తిరగకుండా ఏవైనా భవనాల్లోకి లేక తాము ఉన్న స్థానంలోనే మోకాళ్లపై కూర్చొని రెండు చెవులను చేతులతో మూసుకోవాలి.

-బహిరంగ ప్రదేశాల్లో పిడుగుపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మొబైల్ సిగ్నల్స్ పిడు గుపడే అవకాశాన్ని ఎక్కువగా కల్పిస్తుంది. పంట పొలాల్లో వాడకూడదు.

-విద్యుత్ స్తంభాలు, సెల్ఫోన్ టవర్లు, బోర్ పంప్ సెట్లకు దూరంగా ఉండాలి. బోరుమో టార్ల నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయం లో వినియోగించవద్దు.


-పశువులను మేతకు బయటకు తీసుకెళ్లకుండా పాకలోనే




ఉంచాలి.

-పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవ కాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వర్షం కురిసినప్పుడు చెట్ల కింద ఉండొద్దు.

-యాప్ ఉపయోగకరం.. నిడమానూరు తహశీల్దార్ కృష్ణయ్య వాతావరణంలోని మార్పులను పసిగట్టి పిడుగుపడే అవకాశాన్ని తెలిపే దామిని యాప్ ప్రజలతోపాటు ముఖ్యంగా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. యాప్ ను వినియోగించి పిడుగుపడే విషయాన్ని గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.



# ఇంట్లో గొడవతో వివాహిత అదృశ్యం

**మిర్యాలగూడ, జూన్ 21,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణం లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైనట్లు సి ఐ ఎం. నాగభూషణరావు ఆదివారం తెలిపారు. 47 ఏళ్ల దాసరాజు ప్రియాంక అలియాస్ శ్రీదేవి భర్త పిల్లలతో కలిసి ఉంటుంది. ఈనెల 20న, భర్తతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికిన ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు దాసరాజు ప్రసాద్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసినవారు పోలీసులకు ( సీఐ-8712670149, ఎస్ ఐ -9441187374 )లకు సమాచారం అందజేయాలని కోరారు.



# హాలియాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

హాలియా,జూన్21(ప్రజా జ్యోతి) అంతర్జాతీయ యోగా దినోత్సవం హాలియా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.యోగా దినోత్సవం లో హాలియా ప్రముఖ పారిశ్రామికవేత్త చిట్టి ప్రోలు యాదగిరి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం హాలియా పుర ప్రముఖులు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా యోగ గురువులు సమక్షంలో ఆవాసనాలు ప్రాణాయామం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతీయుల జీవన విధానానికి ప్రతికగా నిలిచిన యోగ నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది జీవితాలలో భాగమైందని తెలిపారు.ప్రస్తుత జీవనశైలి మార్పుల కారణంగా వెన్నునొప్పి,మెడనొప్పి,మోకాళ్ళ నొప్పులు,రక్తపోటు,మధుమేహం వంటి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సమస్యలను నివారించడంలో యోగ ప్రాణాయామం ధ్యానం కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి రోజువారి జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని యోగా గురువులు సూచించారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నిమ్మల లక్ష్మారెడ్డి,యోగ గురువులు షేక్ జానీ,సైదయ్య,సాధకులు గుర్రం ప్రభాకర్ రెడ్డి,తడకమల్ల శ్రీనివాస్, మోదాల రవీందర్,వెంకట్ నారాయణరెడ్డి,తరి రాము, తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐ పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేయాలి



**సంస్థాన్ నారాయణపురం,**

జూన్ 21, (ప్రజాజ్యోతి) : సిపిఐ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అలాగే ఓటర్ల సవరణ కార్యక్రమం సర్ ను కార్యకర్తలు పర్యవేక్షించాలని సూచించారు. సంస్థాన్ నారాయణపురం మండలం లింగంవారి గూడెంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మామ చిట్యాల సత్తిరెడ్డి ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని ఆదివారం కూనమనేని సాంబశివరావు పరామర్శించారు. సత్తిరెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి రెడ్డి నిరంతరం పార్టీ బలోపేతానికి కృషి చేశాడని తెలిపారు. అలాగే సిపిఐ పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేయాలని సూచించారు. సిపిఐ పార్టీ నిరంతరం పేద వర్గాల కోసం కార్మికుల కోసం పోరాడుతున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమాన్ని సైతం కార్యకర్తలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, పీకే మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, నాయకులు కొండూరు విప్లవ్, బత్తుల సుధాకర్, నరేష పాల్గొన్నారు.

# గూడు చెరిపిన ఈదురు గాలులు

**దుబ్బ తండలో ఈదురు గాలుల బీభత్సం,**

**పెన్ పహాడ్, జూన్ 21(ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని దుబ్బ తండ గ్రామంలో శనివారం వీచిన అకాల ఈదురు గాలులు తీవ్ర నష్టాన్ని, విషాదాన్ని మిగిల్చాయి. గాలుల ధాటికి గ్రామంలోని సుమారు పది ఇళ్లు పూర్తిగా మరియు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఇళ్లపై ఉన్న కప్పులు, రేకులు గాల్లోకి కొట్టుకుపోవడంతో బాధిత కుటుంబాలు నిలువనీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆదివారం బాధితులు మీడియా ద్వారా తమకు జరిగిన నష్టాన్ని, పడుతున్న అవస్థలను వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. ప్రకృతి వైపరీత్యం వల్ల తాము సర్వం కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.బాధితుల్లో భూక్యా పావని ప్రవీణ్, భూక్యా శారదా సైదా, నునవత్ మమతా దేవా, నునవత్ హుస్సేన్ పార్వతి, జాటోత్ రవి కుమార్ సుజాత తదితరులు ఉన్నారు. ఈ అకాల విపత్తుతో సర్వం కోల్పోయామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే తమకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి శాశ్వత నివాస వసతి కల్పించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రకృతి వైపరీత్యం కారణంగా నిలువనీడ కోల్పోయి, ఆకాశమే పైకప్పుగా మారిన ఈ పేద కుటుంబాల పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా ఉంది. సంబంధిత రెవెన్యూ మరియు మండల అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే పర్యటించి, జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చూడాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.





# తెలంగాణ అభివృద్దే... జయశంకర్ సార్ కు నిజమైన నివాళి - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, జూన్ 21,( ప్రజాజ్యోతి ):**

తెలంగాణ అభివృద్దే ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు నిజమైన నివాళులని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)అన్నారు. ఆదివారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి





ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం అంకితభావంతో పనిచేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పి, ఉద్యమానికి మేధో బలాన్ని అందించిన గొప్ప తాత్వికవేత్తగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు అని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ చేసిన సేవలు అమూల్యమైన వని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, కాంగ్రెస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించిన సిబ్బంది, న్యాయవాదులు

**?మిర్యాలగూడ,జూన్ 21, ( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ యోగా దినోత్సవం ఉత్సాహంగా నిర్వహిం చారు. యోగా గురువు రంగ సిద్దయ్య పర్యవేక్షణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మరియు ప్రజలు వివిధ యోగా సనాలను సాధనచేశారు.

?ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.పవన్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక వైద్యశాస్త్రంపరిష్కరించలేని ఎన్నో ఆరోగ్య సమస్యలకు యోగా ఒక అద్భుతమైన మార్గమని, దీని విశిష్టతను ప్రపంచం గుర్తించిందన్నారు. భారతీయులుగా మనం యోగాను ప్రపంచానికి అందించడం గర్వకారణమని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకో వాలన్నారు.?ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్యరాణి మాట్లాడుతూ అందరు ముఖ్యంగా మహిళలకు యోగా ఎంతో అవసర మన్నారు. ఇంటి పనుల రూపంలో మహిళలకు శారీరక శ్రమ ఉండేదని, నేటి యాంత్రిక జీవనంలో ఆ శ్రమ లోపించిందని, ఆరోగ్యం కోసం తప్పనిసరిగా యోగా సాధన చేయాలన్నారు.

?బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లుమాట్లాడుతూ యోగా అంటే ప్రకృతితో మమేకమై జీవించడం అని,ఇది కేవలం ఆసనాలకే పరిమితం కాకుండా మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని వివరించారు.

యోగ గురువు రంగ సిద్దయ్య మాట్లాడుతూ

?యోగాతో గ్రంథులు, నాడీ మండలం, రక్త ప్రసరణ ఉత్తేజవంతం,




?ఎముకలు దృఢంగా మారుతాయన్నారు.?నిర్జీవత్వాన్ని తొలగించి, మనిషిని పరిపూర్ణుడిగా తీర్చిదిద్దడంలో, యోగాపై విశ్వాసం, నిష్ఠ, ఏకాగ్రత తో సాధన చేస్తే శ్రేష్టమైన సమాజం నిర్మాణమ వుతుందన్నారు. ఈ

?కార్యక్రమంలో ఇసరం కరుణాకర్, రాయారపు భాస్కర్, రెడ్డిపల్లి సైదులు, మేక కుమార్ రెడ్డి, కళ్యాణ్ బాబు, ప్రసాద్, కొంక వెంకన్న, బాలునాయక్, మాతంగి సైదులు, కోర్టు సిబ్బంది దైద శ్రీనివాస్, దైద నాగేందర్, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు మేడి మహేశ్వరి, శ్రీలత, చంద్రకళ, ఝాన్సీ, వెంకటమ్మలు పాల్గొన్నారు. యోగ గురువులు రంగ సిద్దయ్య, తుమ్మలూరి అంజమ్మ, నక్కఆంజనేయులు లను న్యాయమూర్తులు శాలువాలతో సన్మానించారు.



# వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

## హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**పెన్ పహాడ్ జూన్ 21 (ప్రజాజ్యోతి):**

మండల పరిధిలోని న్యూ బంజారాహిల్స్ తండాలో నాభిశిల బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగ రావు, పెన్ పహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తండాకు చేరుకోగానే గ్రామ సర్పంచ్ దారావత్ కవిత రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, మహిళలు ఆయనకు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామాల్లోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉంచేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉంటూ, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. న్యూ బంజారాహిల్స్ తండా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామంలో అంతర్గత రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉండి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒకే రోజు రెండు సాధారణ ప్రసవాలు చేసిన నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్య బృందం




**పాలకవీడు,జూన్ 21(ప్రజా జ్యోతి ):**

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరోసారి తన సేవా నిబద్ధతను చాటుకుంది. ఒకే రోజు రెండు సాధారణ ప్రసవాలు విజయవంతంగా నిర్వహించి తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణలో తన ప్రత్యేకతను నిరూపించింది.

వైద్యాధికారి డా. పున్న నాగిని ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమిష్టి కృషితో ఇద్దరు గర్భిణులకు సురక్షితంగా సాధారణ ప్రసవాలు నిర్వహించబడినాయి. ప్రసవించిన తల్లులు, నవజాత శిశువులు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవలు, నిరంతర పర్యవేక్షణ, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్ల సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతోందని వైద్యాధికారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గర్భిణీల కుటుంబ సభ్యులు నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుండడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏ ఎన్ ఎమ్ లు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని తల్లీబిడ్డలకు శుభాకాంక్షలు తెలిపారు. “సురక్షిత మాతృత్వం -- ఆరోగ్యకరమైన శిశువు మా లక్ష్యం” అని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం పేర్కొంది.

# యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం





**పెన్‌పహాడ్, జూన్ 21(ప్రజా జ్యోతి):**

మండల కేంద్రంలోని పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం ఉదయం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ప్రాంగణంలో వైద్యాధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పెన్‌పహాడ్ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ.. యోగా అనేది ప్రాచీన భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని కొనియాడారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడానికి, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ), గుండె జబ్బులు వంటి అనేక జీవనశైలి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. కేవలం ఒక రోజుతో సరిపెట్టకుండా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగా వల్ల కలిగే శాస్త్రీయ, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు సుదర్శన్ రెడ్డి, మమతల ఆధ్వర్యంలో పాల్గొన్న వారందరితో వివిధ రకాల ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామాలు చేయించారు. ఏ ఆసనం ఏ ఆరోగ్య సమస్యకు ఉపయోగపడుతుందో ఈ సందర్భంగా వారు ప్రత్యక్షంగా చేసి చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు తాడూరి వెంకన్న, ప్రభాకర్, నర్సింగ్ ఆఫీసర్ స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్లు వెంకటరమణ, దుర్గాభవాని, గీత, ఆశా కార్యకర్తలు కవిత, వెంకటరమణ, పద్మ, భద్రమ్మలతో పాటు పీహెచ్‌సీ సిబ్బంది, ఫార్మసిస్ట్ షాజహాన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# “మహతి కవి భూషణ” అవార్డు అందుకున్న పోచం లక్ష్మీనరసయ్య

మోత్కూరు, జూన్ 21 (ప్రజా జ్యోతి):

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహతీ సాహితీ కవి సంగమం 6వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో డాక్టర్ అడిగొప్పుల సదయ్య అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా “యోగా సంగమం” అనే అంశంలో కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగు సాహిత్య రంగంలో విశిష్ట ప్రతిభను కనబరుస్తూ తన కవిత్వం ద్వారా సాహిత్య విలువలను సమాజానికి చాటిచెప్పి సృజనాత్మక రచనలతో పాఠక లోకాన్ని అలరిస్తూ సాహిత్యాభివృద్ధికి విశేష సేవలందించిన మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన హిందీ పండిట్ పోచం లక్ష్మీనర్సయ్య సాహిత్య కృషిని, కవితా వైభవాన్ని, తెలుగు భాషాభివృద్ధికి చేసిన సేవలను గుర్తిస్తూ “మహతీ కవి భూషణ “ అనే బిరుదును మహతీ సాహితీ కవిసంగమం వారు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు డా: అడిగొప్పుల సదయ్య, సత్యం మాస్టారు, జోషి మధుసూధన శర్మ, నాయకంటి నరసింహా శర్మ తదితరులు పాల్గొన్నారు.



# నీరు కాదు... వ్యాధులకు ఆహ్వానం.. 10వ వార్డు వాసుల ఆవేదన

**భూదాన్ పోచంపల్లి, జూన్ 21(ప్రజాజ్యోతి):**

మున్సిపాలిటీలోని 10వ వార్డులో గృహ అవసరాలకు ప్రజలకు వస్తున్న నీరు నల్లగా, మురుగు నీటిని తలపించేలా ఉండడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంటకు, స్టానానికి ఇవ్వడానికి కూడా పనికిరాని నీరు రావడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వాపోతున్నారు.

“ఇది నీరు కాదు... వ్యాధులకు ఆహ్వానం” అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటనే వార్డులోని పైపులైన్లను పరిశీలించి, వాటర్ ట్యాంక్‌ను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు కలుషిత నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఏదైనా అంటువ్యాధులు ప్రబలక ముందే అధికారులు స్పందించి రక్షిత మంచినీటి సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.



# క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది...!





## ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, జూన్ 21,( ప్రజాజ్యోతి ):**

గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. ఆదివారం పట్టణంలో పలు టోర్నమెంటులలో నెగ్గిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ముందుగా ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ లో చైర్మన్ కప్ క్రికెట్ టోర్నమెంటు లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం క్లియో స్పోర్ట్స్ ఆరేనా వేదికగా నల్గొండ బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోనెక్స్ సన్ రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ -2026 ముగింపు కార్యక్రమంలో పాల్గొని వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించి మిర్యాలగూడ కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా వివిధ స్థాయి క్రీడలు నిర్వహిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు, సంస్థలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# మార్పు దిశగా 'మహా' రాజకీయాలు.. బీజేపీ, శివసేనలపై ప్రభావమెంత?

**ఇంటర్నెట్ డెస్క్:**

మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. శివసేన(ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే)కు చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. వారు ఇప్పటికే లోక్సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఓ లేఖను అందజేశారు. ఈ ఫిరాయింపు ఓ లాంఛనమే కాగా.. సంబంధిత ప్రక్రియ త్వరలోనే పూర్తయ్యే అవకాశముంది. ఫలితంగా లోక్సభలో ఏక్నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన బలం 13కు పెరుగనుంది. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో 13 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్తో సమానంగా ఉంటుంది. మరోవైపు.. 9 స్థానాలతో బీజేపీ మూడో స్థానానికి పరిమితం కావాల్సి వస్తుంది. అయితే.. బీజేపీ-షిండేలకు చెందిన మహాయుతి కూటమిలో ఈ పరిణామం నూతన ఒత్తిడులకు దారితీయవచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్తో షిండే మధ్య అభిప్రాయ భేదాలపై ఇప్పటికే చర్చలు సాగుతున్నాయి. కేంద్ర మంత్రివర్గంలో షిండే వర్గానికి మరింత ప్రాధాన్యం లభించే అవకాశమున్నట్టు కూడా తెలుస్తోంది. ఇక కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. ఇటీవల 'ఇక ఒకే శివసేన' అని చేసిన వ్యాఖ్య కూడా ఈ రాజకీయ మార్పులకు నేపథ్యంగా భావిస్తున్నారు. మరోవైపు.. ఈ చేరికలు 2029 ఎన్నికల వ్యూహంలో షిండేకు మరింత బలం చేకూర్చనున్నాయి.ఆరుగురు



ఎంపీల చేరికతో పాటు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ విస్తరణపై కూడా షిండే దృష్టి సారిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతం చేయడం, సంస్థాగతంగా విస్తరించడం ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. మొత్తంగా తాజా పరిణామం మహారాష్ట్ర రాజకీయాల్లో పార్టీ బలాబలాలను మరోసారి మార్చే అవకాశముంది. బీజేపీ, శివసేన(షిండే వర్గం) మధ్య సంబంధాలు కొత్త దశకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి.

